విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 01, నవంబర్ 2022

పాఠశాలల్లో తరగతులను ప్రారంభించాలి

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ బీసీ రెసిడెన్షియల్ (బాలుర) విద్యాసంస్థలలో తక్షణమే అడ్మిషన్స్ నిర్వహించి తరగతులను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై సగానికి పైగా పూర్తికావస్తున్న ఇప్పటికీ కనీసం అడ్మిషన్స్ ప్రక్రియనే ప్రారంభం కాకుండా విద్యార్థులకు విద్యా సంవత్సరం మొత్తం విద్యను దూరం చేసే విధంగా నిర్లక్ష్యం వహించడం సరికాదని,తక్షణమే తరగతులు ప్రారంభించి విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా విద్యా సంవత్సరం నష్టపోకుండా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఒకవైపు ఇదే అదునుగా చూసుకున్న ప్రైవేట్ ఐటీఐ,ఇతర విద్యాసంస్థలు తమకు దొరికిన అవకాశాన్ని ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ విద్యా సంస్థలు తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తాసిల్దారు అధికారులతో చర్చించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను వీలైనంత తొందరగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ప్రదీప్, విజయ్, కార్తీక్, చైతు, జగదీష్, అల్లబకాస్, సాయి,శేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి రాష్ట్రీయ ఏక్తా దివస్ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల పట్టణం ఎస్పిజి స్కూల్ నుండి రన్ ఫర్ యూనిటీ ర్యాలీని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇషాక్ భాషా పాల్గొన్నారు. ర్యాలీ వై జంక్షన్, మున్సిపల్ ఆఫీసు, పద్మావతి నగర్ మీదుగా మార్కెట్ యార్డ్ చేరుకొని మార్కెట్ యార్డ్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఏకతా దివాస్ పురస్కరించుకుని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ మాట్లాడు తూ భారతదేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ప్రముఖ స్వాతంత్ర్య యోధుడిగానే కాకుండా స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి గట్టి కృషిచేసి సఫలుడై ప్రముఖుడిగా పేరుపొందారని కొనియాడారు. హైదరాబాదు, జునాగఢ్ లాంటి సంస్థానాలు దేశంలో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ రమణ, డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ దాస్, పట్టణ సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాలో నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, నకిలీ విత్తనాలు అరికట్టడంలో వైఫల్యం చెందిన వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలని, నకిలీ విత్తనాల కంపెనీలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నూనెపల్లెలోని వ్యవసాయశాఖ అధికార కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జెడిని కలవాలని రైతులు పట్టు పట్టడంతో కలెక్టర్ కార్యాలయానికు వెళ్లాలని ఏడి రాజశేఖర్ తెలిపారు. దీనితో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీతో బయలుదేరి నకిలీ విత్తన యజమానులపై చర్యలు తీసుకోవాలని, అలాగే విత్తన సంస్థలకు సహకరిస్తున్న ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. సిపిఐ, కార్మిక, ప్రజాసంఘాల నాయకత్వాన ధర్నా నిర్వహించి వినూత్నంగా రైతులు మెడకు ఉరితాళ్ళు బిగించుకొని నిరసన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి పంట చేతికి రాకపోగా అప్పులపాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రధానంగా కావేరి, ప్రభాస్ విత్తన సంస్థలు నకిలీ విత్తనాలు తయారు చేస్తున్నారని అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల జిల్లాలోని గోస్పాడు, పాణ్యం, నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్ మండలాలకు చెందిన రైతులు నష్టపోయారని ఆరోపించారు. స్పందించిన జెడి మాట్లాడుతూ తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామ్మూర్తి, సుంకయ్య, సిపిఐ నాయకులు రమేష్ కుమార్, భాస్కర్, సామెల్, హరినాథ్ భూమని శ్రీనివాసులు మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ ఏఐఎస్ఎఫ్‌జిల్లాఉపాధ్యక్షులు,సురేష్‌ఎర్రిస్వామి,పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలను తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర-నందికొట్కూరు : రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు కాంతులు విరుజిల్లుతున్నాయని అభివృద్ధిలో గ్రామాలను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఆధ్వర్యంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికి తిరుగుతూ మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజలకు అందినటువంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఎక్కడ కులాలు చూడకుండా పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఏ ఒక్క సామాజిక వర్గానికి కొమ్ము కాయకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను, ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి, విద్యుత్ ఏఈ రాములు నాయక్, ఏవో శ్రావణి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాధురి, హౌసింగ్ ఏఈ అరుణ్, ఈ ఓ ఆర్ డి సుబ్రహ్మణ్యం శర్మ, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై ఓబులేష్, సింగిల్ విండో చైర్మన్లు హరి సర్వోత్తమ్ రెడ్డి, ఉషనయ్య, గ్రామ వైసిపి నాయకులు మాధవరం యేసు రత్నం, సంజన, వేల్పుల నాగన్న, జయచంద్ర, వేల్పుల జ్యోతి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలంలో ని స్థానిక పట్టణంలోని సెయింట్ జోసెఫ్ విద్యార్థులు 29/10/2022 తేదీన బనగానపల్లె, నందవరం లో జరిగిన నియోజకవర్గ స్థాయి, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాలలో సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ లలిత తెలియజేయడం జరిగింది. అలాగే గేమ్స్ వల్ల శారీరకంగా మానసికంగా ఆనందానికి దోహదపడతాయని, అలాగే క్రీడారంగంలో జాబ్స్ అవకాశాలు వస్తాయి చెప్పడం జరిగింది. కరస్పాండెడ్ జాన్ మేరీ సిస్టర్ మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే అని తెలియజేశారు. అలాగే జెయంజె సభ వ్యవస్థాపక దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు పలు సాంస్కృతిక కార్యక్రమాలు మరియు బహుమతులను సిస్టర్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫీజికల్ డైరెక్టర్స్ మరియు ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

గుండెపోటుతో కౌలు రైతు మృతి

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : మండలంలోని బిజినవేముల గ్రామానికి చెందిన శివుడు(43) అనే కౌలు రైతు సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శివుడు ఐదు ఎకరాలు కౌలు కు తీసుకొని జొన్న విత్తనం వేసిన మొలక రాలేదన్నారు. మృతి చెందిన కౌలు రైతుకు భార్య ,కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.

25 కుటుంబాలు టిడిపిని వీడి వైసీపీలో చేరిక

విశాలాంధ్ర - బనగానపల్లె : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో అప్పలాపురం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టిడిపి పార్టీని వీడి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పార్టీలో చేరడం జరిగింది. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిమాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మరియు జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వడ్డేపేట కాలనీకి చెందిన 25 కుటుంబాలు టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్ పార్టీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. హరీష్ రెడ్డి, అశోక్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి ,కర్ర తిరుప రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల : ఎఐటీయుసి 103వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక సీపీఐ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. కార్మికుల 44 చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా కుదించిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీపీఐ కార్యాలయం నందు ముందుగా నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య జాతీయ జెండాను, జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి ఎఐటియుసి జెండాలను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌లు పాల్గొని ప్రసంగించారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ప్రసాద్, నంద్యాల పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, అధ్యక్షుడు ఆటో శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, బికేఎంయు జిల్లా అధ్యక్షుడుసుబ్బరాయుడు, ఎఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విష్ణుతో పాటు వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర-డోన్ : భారత దేశానికి స్వాతంత్ర్యం కావాలని ఉద్యమించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు.సోమవారం ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా సీపీఐ సర్కిల్‌లో ఉన్న ఏఐటీయూసీ పతాకాన్ని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్వర్ ఆవిష్కరించారు.ఆ తరువాత సీపీఐ కార్యాలయం ముందు జాతీయ జండాను ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్. లక్ష్మీనారా యణ ఎగురవేశారు. నక్కిరామన్న భవనంలో అబ్బాస్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అధితులుగా హాజరై ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఆనాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యము కావాలని ఉద్యమించి ఎంతో మంది కార్మిక నాయకులు తమ ప్రాణాలు అర్పించిన ఘన చరిత్ర ఏఐటీయూసీకి ఉందని ఆయన వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమం తోపాటు కార్మిక హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు చేపట్టి బ్రిటిష్ కాలంలో సాధించుకున్న 44 చట్టాలను అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను సవరించి 4కొడులుగా విభజించి కార్మిక హక్కులను కలరాసే విధంగా చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు చేతిలో ప్రభుత్వ సంస్థ పెట్టి కుట్రలు పన్నుతోందని ఆయన తెలిపారు.కార్మిక లోకం ప్రభుత్వ కుట్రలను అర్థం చేసుకొని సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టాలని ఆయన కోరారు. సీపీఐ మండల కార్యదర్శి పులి శేఖర్, ఏఐటీయూసీ నాయకులుసురేంద్ర,భాస్కర్,రవి,సుంకన్న,అంగన్వాడీ వర్కర్స్ యూనియన్‌నాయకురాళ్లుజులేఖ,ఎస్తేరమ్మ,రెహమత్‌బీ,రమాదేవి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బనగానపల్లె : పట్టణంలో ఏఐటియుసి ఆవిర్భాజన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పెట్రోల్ బంక్ దగ్గర ఏఐటియుసి 103 వ ఆవిర్భావం దినోత్సవం కార్యక్రమానికి బనగానపల్లె ఏఐటియుసి అధ్యక్షుడు కుళాయి స్వామి ఆధ్వరంలో ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా సమితి సభ్యుడు సంజీవులు హాజరై జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.బాలకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు కనీసం వేతనం 26000, రూపాయిలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విశాఖ ఉక్కు ప్రైవేటుకారణ ఆపాలని విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుబ్బరెడ్డి, గిరిజన సామ్యఖ్య జిల్లా అధ్యక్షుడ ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పవన్ కళ్యాణ్,సీపీఐ నాయకులు ఖాదర్,వేంకట స్వామి, శివ నాగయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఏఐటీయూసీ కార్యా లయం ముందు ఏఐటీయూసీ నాయకులు ఎస్. కే చాంద్‌బాషా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక చట్టాల సాధన కోసం ఎందరో కార్మికులు ప్రాణత్యాగం చేశారన్నారు. ఏఐటీ యూసీ నాయకత్వం పోరాటాలు చేసి సాధించిన 40 కార్మిక చట్టాలను బీజేపీ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత 40 కార్మిక చట్టాలను 4 కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ కార్మికుల ఐ క్యత ను దెబ్బ తీసారన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు మండల కార్యదర్శి టీ. ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు,హుస్సేన్, షబ్బీర్, షైక్షవాలి,సయ్యద్, ఎఐవైయఫ్ తాలూకా కార్యదర్శి అహమ్మద్ హుస్సేన్, ప్రజానాట్యమండలి, నాయకులు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : ఏఐటీయూసీ 103వ ఆవిరబావ దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకట శివుడు జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికు చట్టాల సాధన కోసం ఎందరో కార్మికులు ప్రాణత్యాగం చేశారన్నారు. ఏఐటీయూసీ నాయకత్వంపోరాటాలు చేసి సాధించిన 40 కార్మిక చట్టాలను బీజేపీ రెండవ సారి అధికారం లోకి వచ్చిన తర్వాత 40కార్మిక చట్టాలను 4కార్మిక కొడ్‌లుగా మార్చి కార్మికుల ప్రాణాలతో చలగాటం ఆడుతూ కార్మికుల ఐక్యతను దెబ్బ తిశారన్నారు. భీమలింగం, సురేష్, సచిన్, శ్రీరాములు, బాలు, పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : స్వతంత్ర భారతదేశంలోని గొప్ప నాయకులలో శ్రీమతి ఇందిరా గాంధీ ఒకరనీ. ఆమె నాయకత్వంలో యావత్ దేశం దృఢంగా నిర్భయంగా ఉండేదనీ మతపరమైన, విభజన శక్తులను ఇందిర గాంధీ ఎల్లప్పుడూ వ్యతిరేకించినట్లు అల్లగడ్డ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సి హెచ్ పుల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇందిరా గాంధీ వర్ధంది కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం యొక్క ఐక్యత,సమగ్రతను కాపాడటం కోసం మాజీ ప్రాదాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ తన ప్రాణాలను అర్పించిందనీ పుల్లయ్య పేర్కొన్నారు. దేశ ఐక్యత, అణగారిన వర్గాల సంక్షేమం, దేశంలోని లౌకిక విలువల పట్ల ఆమె చూపిన నిబద్ధత నిస్సందేహమైనదనీ, ప్రశంసనీయమన్నారు. 1984 అక్టోబర్ 31న ఆమె తన సొంత భద్రత రక్షకుల తూటాలకు నేలకొరిన ఆమె త్యాగం మరియు సేవను స్మరించుకుంటూ ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాలులు అర్పించారు.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షంశుల్ హక్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 38వ వర్ధంతివేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఇందిరా గాంధీ దేశంలో దళితులకు ఇండ్లు,రైతులకు గిట్టుబాటు ధర,వ్యాపారస్తులు ఉద్యోగస్తులు ప్రతి ఒక్కరు ఎంతో అభివృద్ధి చెందారన్నారు. భారతదేశం యొక్క ఐక్యత, అణగారిన వర్గాల సంక్షేమం, దేశంలోని లౌకిక విలువల పట్ల ఆమె ఎంతో నిబద్ధత చూపిందన్నారు. దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బరగోడ్ల హుస్సేన్ భాష , వై సంజీవ కుమార్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులని ఆదుకొని,వడ్డీతో సహా అందరికి డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో తహశీల్దార్ కార్యాలయాలలో వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కోదండ రాముడు ఆధ్వర్యంలో మండల అగ్రిగోల్డ్ బాధితులు తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అగ్రిగోల్డ్ కస్టమర్స్,ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.నాగరాజు,సీపీఐ మండల నాయకులు ఉదయ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని, ఇప్పటికైనా బాధితులను గుర్తించి,ప్రతి ఒక్క బాధితునికి వడ్డీతో సహా డబ్బులు ఇప్పించి పూర్తి న్యాయం జరిపించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బాధితుల పక్షాన సీపీఐ అండగా ఉండి, ప్రభుత్వ మెడలు వంచి సాధిస్తామని వారు అన్నారు. దస్తగిరి, జగదీష్, లోకేష్, మధురామయ్య, రమణయ్య,తదితర అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : గ్రామ, వార్డు సచివాలయాల్లో వీఆర్వోలకు సదుపాయాలు కల్పించాలని వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సచివాలయాల్లోని సమస్యలపై తహశీల్దార్ రవికుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో రెండు కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయని, ఇందులో ఒకటి పూర్తిగా డిజిటల్ అసిస్టెంట్ వినియోగిస్తున్నారని, ఇంకొకటి మిగతా సిబ్బందికి సరిపోతుందని, రెవెన్యూ పరంగా 90 శాతం ఆన్లైన్ సేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న తరుణంలో కంప్యూటర్, రికార్డులు భద్రపరుచు కునేందుకు బీరువాలు లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామన్నారు. అలాగే పని దినాల్లో కాకుండా సెలువు దినాల్లో కూడా పనిచేయమని ఒత్తిడి తెస్తున్నారని ఇది సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వేణుగోపాల్, వీఆర్వోలు రవిప్రసాద్, దాదాసాహెబ్, దస్తగిరి, గోపాలులు పాల్గొన్నారు.

పంట నమోదులో అభ్యంతరాలు ఉంటే తెలపండి

విశాలాంధ్ర - అవుకు : మండల వ్యవసాయ అధికారి ఈ.ప్రసాద్ రావు అవుకులోని రైతు భరోసా కేంద్రం నందు ప్రదర్శించిన పంట నమోదు రైతుల జాబితాను సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని అన్ని రైతు భరోసా కేంద్రాల నందు ఖరీఫ్ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం సందర్శనకు ఉంచడం జరిగిందని, ఆయా గ్రామాల పరిధిలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వారి పంట నమోదు వివరాలను సరి చూసుకోవాలని తెలియజేశారు. అలాగే పంట నమోదు వివరాలలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో సంబంధిత వ్యవసాయ సహాయ కునికి వారి అభ్యంతరాలు తెలియజేస్తూ అర్జీని నవంబర్ 1వ తేదీలోగా ఇవ్వా లని తెలియజేశారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకురాలు ఉమ దేవి మరియు రైతులు పాల్గొన్నారు.

వైద్యులు మానవతా దృక్పథంతో పని చేయాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : ప్రభుత్వ వైద్యులు మానవతా దృక్పథంతో పనిచేయాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సయ్యద్ మహమ్మద్ హనీఫ్ అన్నారు. సోమవారం స్థానిక డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేదలు వైద్యులపై నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తూ ఉంటారని అటువంటి వారి పట్ల వైద్యులు మానవత్వంతో మెలగాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 350 నుండి 400వరకు ఓపిలు నమోదు అవుతున్నాయని తెలిపారు. సీజనల్ వ్యాధులు మొదలైనప్పుడు ఓపిలు 500 పైనే ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం వైద్యశాలలో ఇరువురు గైనకాలజిస్టులు,ఒకరు అనేస్తేసీయ, ఇద్దరు డెంటిస్టులు ఒక ఈఎన్ టీ, ఆర్థోపెడిక్, చర్మవ్యాధి నిపుణులు ఒకరు, ల్యాబ్ నందు పనిచేసే పెథాలజీ మరియు జనరల్ సర్జన్, చిన్నపిల్లల డాక్టరు పనిచేస్తున్నారని తెలిపారు. వైద్యశాలలో మరికొంతమంది డాక్టర్ల అవసరం ఉందని హనీఫ్ తెలిపారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాలోని నంద్యాల పట్టణం నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ నందు స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమైనవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, నంద్యాల డిప్యూటీ ఈవో మహబూబ్ బిగ్ రిబ్బన్ కట్ చేసి ఈ పోటీలను ప్రారంభించడం అయినది. విశిష్ట అతిథులుగా రామకృష్ణ పీజీ కళాశాల కరస్పాండెంట్ హేమంత్ రెడ్డి, రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ హానర్బుల్ ప్రెసిడెంట్ నిమ్మకాయ సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా నంద్యాల మండల ఇంచార్జ్ ఏపీ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం చలపతి, అసవుద్దీన్ మెయిన్ స్కూల్, మున్సిపల్ స్కూల్ కోఆర్డినేటర్ శివకుమార్, నంద్యాల జిల్లా స్టేడియం చీవ్ కోచ్ రాజు పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నంద్యాల, గోస్పాడు మండలాలకు సంబంధించిన పీడీలు సాల్మన్, రాజేష్, ఓబులేష్, పద్మారెడ్డి, పార్వతి సురేష్ నాయుడు వెంకట్ దాస్ రవికుమార్ విశ్వనాథ్ మహబూబాషా, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి రాజేష్, హరి, రాజశేఖర్ పెద్దిరాజు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల చెందిన పలువురు విద్యార్థిని, విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలపోటీలకుఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పిడి రంగస్వామిలు తెలిపారు.సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలనందు వారి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి ఎంపికైన విద్యార్థులను కమిటీ చైర్మన్ షేక్షావలి, ఉపాధ్యాయులు,సభ్యులు అభినందించారు.అక్టోబర్ 29వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందవరం నందు నియోజవర్గ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించగా అందులో పలు రకాల క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.అండర్17 బాలుర విభాగం ఖోఖోలో సిద్దార్థ, అనిల్,జానీ, కపిల్,కరుణాకర్,మల్లికార్జునరెడ్డి, మహమ్మద్‌హుస్సేన్,బాలికల విభాగంలో అఖిల, భార్గవి, మనిషా, అండర్ 14 బాలుర విభాగం ఖోఖోలో అశోక్,హనీఫ్, ఖాజా హుస్సేన్,రంజిత్, పార్థసారథి, గోవర్ధన్, బాలికల విభాగంలో సుమశ్రీ, వైష్ణవి, వెంకట సంధ్య, బాబా జైనాబ్,అండర్ 17 బాలుర వాలీబాల్ లో హర్షవర్ధన్, పెద్ది రాజులు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు బాల సుబ్బారెడ్డి మహమ్మద్ షఫి,యల్లాసుబ్బయ్య,ఉషారాణి,రంగస్వామి,వెంకోబరావు అభినందించారు.

పట్టభద్రుల ఓటు హక్కును నవంబర్ 7లోపు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-కోసిగి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను శాసించే ఓటు హక్కును నవంబర్ 7వ తేదీ లోపు నమోదు చేసుకువాలని,వామపక్షాలు బలపరుస్తున్న పిడిఎఫ్,రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నర్సింహారెడ్డి గారిని గెలిపిం చాలని కోరుతూ సిపిఐ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న నిరుద్యో గులతో విస్తృత ప్రచారం నిర్వహించారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, జి రంగన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న , జిల్లా ఉపాధ్యక్షుడు థామస్, మంత్రాలయం తాలూక అధ్యక్షుడు ఎస్. ఈరేష్ లు మాట్లాడుతూ 2023లో జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నీతికి నిజాయితికి మధ్యన జరుగనున్న ఎన్నికలని, ధనికులకు,సామాన్యులకు,సేవపారులకు మధ్య జరగనున్న ఎన్నికలన్నారు.గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాలకులు మారిన మన స్థితిగతులు మార్చు కాలేదన్నారు. మన ఓట్ల పైన గెలిచిన నాయకులు మాట్లాడ కుండా గంగిరెద్దులయ్యారన్నారు.మన సమస్యలు గాలికి వదిలేసారని,మన సమస్యలు తెలిసిన పోతుల నాగరాజును, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలన్నారు. నవంబర్ ఏడవ తేదీ (7)కంత ఓటు నమోదు చేసుకొని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.గెలిస్తే చట్టసభల్లో మన అందరి గొంతకై సమస్యలపై పోరాడుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి అంజి,జీవన్,అఖిల్ నాయకులు,ప్రకాష్, వీరేష్,కోసిగయ్య పాల్గొన్నారు.

మ్యాథ్స్ లెక్చరర్‌ను నియమించండి

విశాలాంధ్ర -పత్తికొండ : పట్టణ ంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో మ్యాథ్స్ లెక్చ రర్‌ను నియ మిం చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్ డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల విద్యార్థినీలతో కలిసి స్పందన కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌దాస్‌కు వినతిపత్రం సమర్పిం చారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్, మరియు సెకండ్ ఇయర్‌లో దాదాపుగా వందమంది విద్యార్థులు విద్యనుభ్యసిస్తున్నారని, కీలకమైన మ్యాథమెటిక్స్ కు రెగ్యులర్ గా లెక్చరర్ లేకపోవడంతో విద్యాబోధన కుంటు పడి, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ జమీర్ పాష, జిల్లా ఇన్చార్జి డివి ఈవోగా బాధ్యతల్లో ఉన్నా కూడా కళాశాల గురించి తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ఆయన తీవ్రంగా తప్పు పట్టారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రెగ్యులర్ మ్యాథ్స్ లెక్చరర్‌ను నియమించాలని,లేనియెడల ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్షఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులుశివ,షాషా,వలి,రాజు,హరి,షాకీర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతులను మోసము చేస్తున్న వైయస్సార్ ప్రభుత్వం

విశాలాంధ్ర-కోసిగి : రాష్ట్రంలో మాది రైతులు పార్టీ అని ఎన్నికలలో చెప్పి రైతులను మోసము చేసిన ఏకైక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. సోమవారం కోసిగి గ్రామ సమీపాన ఉన్న పులికనుమ ప్రాజెక్టు ను మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన పులికనుమప్రాజెక్టును సందర్శిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పులికనుమ ప్రాజెక్టు ను అప్పటి ఎమ్మెల్యే లు కమీషన్లు తీసుకోని నిర్లక్ష్యము చేస్తూ, కోసిగి మండల రైతులకు,సాగునీరు త్రాగునీరు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. 2014 అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి అధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో పులికనుమ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తెలుగు దేశం పార్టీ దేనన్నారు. మంత్రాలయం నియోజకవర్గం ప్రజలకు సాగునీరు, త్రాగు నీరు అందించాలని తూము ఏర్పాటు చేయడానికి నియోజక వర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి గారు ప్రత్యేక నిధులను తీసుకొచ్చి రైతులకు మేలు చేయాలని చూస్తే ప్రతి పక్షంలో ఉన్న వైయస్సార్ పార్టీ, వైయస్సార్ నాయకులు హైకోర్టులో స్టే వేసి పులికనుమ ప్రాజెక్టు కు తూము ను నిలబెట్టి రైతులను మోసము చేశారన్నారు. ఎన్నికల సమయంలో పులికనుమ ప్రాజెక్టు ద్వారా తూము ఏర్పాటు చేసి రైతులను అదుకుంటాం అని చెప్పి మూడు సంవత్సరాలు అయినా ఇప్పటికీ పట్టించుకోకుండా వైయస్సార్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. రాబోయే రోజుల్లో వైయస్సార్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్కిసాగరం.లక్ష్మారెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి నాడిగేని అయ్యన్న, సుధాకర్ శేట్టి, కృష్ణా రెడ్డి,పరమేశ్వర రెడ్డి,రంగమూని,కదిరికోట. ఆదేన్న,అల్తాఫ్, హరిప్రసాద్ రెడ్డి,రాఘవేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు నాడిగేని రంగన్న, కోండగేని వీరారెడ్డి, సాతూనూరు కోసిగయ్య, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్,చిన్న భూంపల్లి. నరసింహులు,రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఏఐటీయూసీ 103వ వ్యవ స్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఉచిత రక్తదాన శిబి రాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో 30మంది హోటల్ వర్కర్స్ యునియన్ కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు.ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునియప్ప రక్తదాతలను అభినందించారు. అంతకుముందు నగరంలో ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఏఐటియుసి జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాసుదాస్ గుప్తా నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయ లలితమ్మ, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యంలునివాళులర్పించారు.నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో మునెప్ప మాట్లాడుతూ1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఆనాటి స్వతంత్ర సమరయోధులు లాల లజపతిరాయ్ ,బిపిన్ చంద్రపాల్ ,అజయ్ చంద్రశేఖర్లు జోహార్ లాల్ నెహ్రూ ఇలాంటి స్వతంత్ర సమరయోధులు ఏర్పాటుచేసిన ఏకైక జాతీయ కార్మిక సంఘం ఏఐటియుసి నేననికొనియాడారు . దేశ స్వాతంత్ర్యం, సమ సమాజం, సోషలిజం లక్ష్యాలుగా భారతదేశంలో ఏఐటీయూసీ పోరాటం చేసిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం వ్యతిరేకంగా రెండో ప్రపంచ యుద్ధం నివారించాలని పోరాటం చేసిన సంఘం కూడా ఏఐటీయూసీయేనన్నారు కార్మిక వర్గం కోసం అశేష త్యాగాలు చేసి 44కార్మిక చట్టాలను సాధించినటువంటి చరిత్ర కలిగిన సంఘంగా గుర్తింపుం దన్నారు. లలితమ్మ మాట్లాడుతూ కామ్రేడ్ గురుదాస్ గుప్తా విద్యార్థి ఉద్యమం నుండే వామపక్ష ఉద్యమాలకు ఆకర్షితుడై జాతీయ ప్రధాన కార్యదర్శిగా,పార్లమెంటుసభ్యుడుగా గొప్ప గొప్ప పదవులలో పనిచేశాడని కొనియాడారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి పార్టీ ఈ దేశంలో కార్మిక హక్కుల కాలరేసేందుకు కార్మిక చట్టాల్లో మార్పులు చేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేటర్లకు అమ్ముతున్నారని ఆమె ఆరోపించారు. దేశంలో ఉన్నటువంటి కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నగర నాయకులు బి. వెంకటేష్, టి రామాంజనేయులు,కృష్ణారెడ్డి, నల్లన్న,కృష్ణ, రేణుక, పురుషోత్తం,ఆనంద్,మృతుజ, అబ్బాసు,నాగరాజు, పులగం మద్దిలేటి, రాము, డి శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : పట్టణ శ్రీనివాస సర్కిల్ ట్రాక్టర్ హమాలి వర్కర్స్ కార్యాలయం దగ్గర ఏఐటీయూసీ 103 వ వ్యవస్థాపక దినోత్సవం ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి యెస్.బాలరాజు అధ్యచతన జరిగింది. ఏఐటీయూసీ జెండాను ట్రాక్టర్ హమాలి వర్కర్స్ సీనియర్ నాయకులు నరసిములు జెండాను ఎగురవేశారు. తిమ్మగురుడు, వీరేశ్,బజారి, మల్కన్నగౌడ్,కేసి.జబ్బార్, మల్లికార్జునగౌడ్, రామంజి,శంకర్,వెంకటేష్,వీరేంద్ర,రామంజి,శివ,చిన్న రామంజి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దేవనకొండ రూరుల్ : శ్రామిక వర్గానికి ఏఐటియుసి నే భరోసా అని ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు ఎం. నరసారావు అన్నారు. సోమవారం స్థానిక దేవనకొండ క్రాస్ రోడ్డు టర్నింగ్ నందు ఏఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిపిఐ పట్టణ కార్యదర్శి నెట్టికల్ అధ్యక్షతన నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని హమాలీ యూనియన్ సీనియర్ నాయకులు దస్తగిరి ఆవిష్కరించారు. సిపిఐ నాయకులు శేఖర్,సురేష్,ఏఐటీయూసీ శాఖ కార్యదర్శి గోపాల్, హమాలి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, రామ్ లక్ష్మణ్, జనార్దన్, నాగరాజు, రంగస్వామి, మునిస్వామి, మహేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పత్తికొండ : ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కూడలిలో ఏఐటీయూసీ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య,రంగన్న, సిపిఐ మండల, పట్టణ కార్యదర్శులుడి. రాజాసాహెబ్, ఎన్. రామాంజనేయులు, నాయకులు కారన్న, పెద్ద ఈరన్న, మాదన్న, గుండు భాష, ఆటో యూనియన్ కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- ఆదోని : కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పోరేట్‌లకు అప్పజెప్పి, దేశ సంపదను ఆదానీ, అంబానీ బడా వ్యాపారులకు అప్పజెబుతున్నారని, కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయుసీ 103వ వ్యవస్థాపక దినోత్సవ సంధర్భంగా ఏఐటీయుసీ జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయుసీ మాజీ ప్రధాన కార్యదర్శి కీర్తిశేషులు కామ్రేడ్ గురుదాస్ గుప్తా నాల్గవ వర్ధంతి సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయుసీ నియోజకర్గం అధ్యక్షుడు ఓబి నాగరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఆస్పరి : మండల కేంద్రంలో హమాలీ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, బస్టాండ్ సర్కిల్‌లో ఉరుకుందప్పలు చేతులు మీదుగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు.హమాలి సంఘం కార్యదర్శి జైపాల్, గౌరవ అధ్యక్షులు బాబు, హుసేని, బజారి, శ్రీనివాసులు, రామాం జిని, రంగన్న, గోపాల్, వీరేశు, గోపి, మారెప్ప లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఆలూరు : పట్టణంలో ఏఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికులను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా సిపిఐ సీనియర్ నాయకులు భూపేష్ చేతులు మీదుగా ఏఐటీయూసీ పథకాన్ని ఆవిష్కరించారు.ఏఐటీయూసీ నాయకులు శివ, సిపిఐ టౌన్ సెక్రెటరీ మునిస్వామి, రంగన్న, భాష, మల్లికార్జున,పులిలోకేష్, గోవింద్,బీమా ఎర్రిస్వామి, ఈశ్వర్, రామంజి, ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ నాయక్, దుర్గా నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు కార్మిక ద్రోహాలకు పాల్పడితే సహించం

విశాలాంధ్ర-కోడుమూరు : ప్రభుత్వాలు కార్మిక ద్రోహాలకు పాల్పడితే సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణ అన్నారు.సిపిఐ సీనియర్ నాయకులు బి మునిస్వామి,ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మధు, ఏఐఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, హమాలి వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బీ బజారి,వైస్ ప్రెసిడెంట్ బి. సుంకన్న,ఏడుకొండలు,చిన్నరాముడు, వెంకట స్వామి, కృష్ణ, శంకర్, మధు, గొర్ల సంఘం నాయకులుశ్రీరాములు పాల్గొన్నారు.

ఉచితంగా కరాటేలో శిక్షణ

విశాలాంధ్ర- ఆదోని : ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కరాటే(త్రైక్వాండో)లో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకుడు అమం ప్రకాష్ తెలిపారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రీడలు, ఆటలపై ఉన్న ఆసక్తితో విద్యార్థిని, విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కరాటేలో బ్లాక్ బెల్ట్ పొందిన శిక్షకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అరుంజ్యోతినగర్ అరులయ్య గుడి వెనుక ఫిలిప్స్ కబడ్డీ గ్రౌండ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతోందని అన్నారు. ఉదయం 6గంటల నుండి 7.30 వరకు ఈ నెల 2వ తేది నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి కలవారు 6303875521 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్తు నమోదు చేసుకోవచ్చన్నారు.

పొట్టకూటి కోసం వలసబాట

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఉన్న ఊరిలో పనులు లేక పొట్టకూటి కోసం కూలీలు వలసబాట పట్టారు. మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో చేయడానికి పను లు లేకపోవడంతో ఎస్సీకాలనీ చెందిన 20కుటుంబాలు తెలంగాణ రాష్ట్రం లోని నాగర్ కర్నూలుకు టెంపోలో వలస వెళ్లారు. గ్రామంలో కూలీ పను లు లేక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని కూలీలు హను మంతు, ఈరన్న, భీమన్న, రాజు,శాంతమ్మ,లక్ష్మి, మార్తమ్మ విలేకరుల ముందు వాపోయారు. దీంతో నాగర్ కర్నూలులో కేజీల పత్తి తీయడానికి వెళుతున్నామని, కేజి పత్తి తీస్తే 12రూపాయలు ఇస్తారని తెలిపారు. కావున అధికారులు స్పందించి గ్రామాలలో ఉపాధి హామీ పనులను చేపట్టి వలసలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హంద్రీనీవా జలాలను తరలించడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - దేవనకొండ : కృష్ణ మిగులు జలాలతో వెనుకబడిన రాయ సీమ జిల్లాలోని బీడు భూములను సశ్యశామలం చేసేందుకు గత ప్రభుత్వాలు హంద్రీనీవా సాదిస్తే ఈ ప్రభుత్వం నీరుగార్చి జలాలను తరలించ డంలో ఘోరంగా విఫలమైందని ఆలూరు టిడిపి ఇంచార్జీ కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్‌లో హంద్రీనీవాకు నీరు వదలాలని రాస్తారోకో చేశారు.దాదాపు గంటన్నర సేపు దర్నా నిర్వహించడంతో బారీగా వావహానాలు నిలిపోవడం జరిగింది.మె మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు పెరుకుపోవడంతో హంద్రీనీవా నీటి సరఫరా నిలిచివేసిన్నట్లు ప్రభుత్వం వైఫల్యం వల్లె సమస్య నెలకొంద న్నారు. తక్షణమే ప్రభుత్వం హంద్రీనీవా నీటి వాటా వచ్చేంతవరకు మార్చి చివరి వరకు నీటిని రైతులకు ఇవ్వాలని సుజాతమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్,బడిగింజల రంగన్న,వీరేష్,మలకన్న, మల్లికార్జునగౌడ్, చెన్నకేశవులు,శ్రీరాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం గురుదాస్ దాస్ గుప్తా

విశాలాంధ్ర-పత్తికొండ : ఆదర్శనీయుడు కామ్రేడ్ గురుదాస్ దాస్‌గుప్తా అని సిపిఐ మాజీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి పి.భీమలింగప్ప, సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్య దర్శి ఎన్.కృష్ణయ్యలు అన్నారు.సోమవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో కామ్రేడ్ గురుదాసు దాస్ గుప్తా మూడవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షు లు గురుదాస్,సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనే యులు, ఏఐటీ యూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి పెద్ద ఈరన్న, నాయకులు గుండు భాష, మాదన్న, జొహరాపురం కాశి, నరసింహులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు కంట కన్నీరు....!

విశాలాంధ్ర-చిప్పగిరి : అప్పు చేసి ఉల్లి పంటను సాగు చేస్తే అధిక వర్షాల వల్ల ఉల్లి పంట పూర్తిగా నాశనమై పోవడంతో రైతు దిక్కుతోచనిస్థితిలో ఉల్లి పంటను తొలగించాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండల ంలోని ఆయా గ్రామాల నందు ఉల్లి పంట సాగు చేస్తే అధిక వర్షాలతో పొలంలోనే ఉల్లి పంట కుళ్ళిపోవడంతో రైతులకు కన్నీరు మిగిల్చిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం పై స్పందించి సాగు చేసిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మరో పంట సాగు చేయాలన్న చేతిలో చిల్లి గవ్వ కూడా లేకపోయే అని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉల్లి పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పందన అర్జీల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆదోని : స్పందనలో వచ్చిన అర్జీల సమస్యలను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ డివిజన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలను విన్నారు.ఆయన అధికారులతో మాట్లాడుతూ స్పందనలో అధికంగా రెవెన్యూ సమస్యలపై ప్రజలు వస్తున్నారని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించడం మన బాధ్యతని అన్నారు. సోమవారం స్పందనలో వచ్చే సమస్యలను శనివారం లోపు పరిష్కరించాలని, స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో బీయండ్ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండ గడువు లోపు సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ నూర్జహాన్, పరిపాలన అధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్‌ఆఫ్ సర్వేర్ వేణు సూర్య, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 27నుంచి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పంటల పరిశీలన చేపట్టారు.ముఖ్య నాయకులు పాల్గొని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లప్ప,నరసప్ప, పట్టణ కార్యదర్శి సుదర్శన్, సహాయ కార్యదర్శి విజయ్, అంజిత్ గౌడ్ ,తమ్మారెడ్డి, గంగన్న ,ఈరన్న గౌడ్ ,రఘుసింగ్ ,ముని,ఖాదర్ లింగ, కరెంటుఈరన్న,అస్సలాం, అమ్మన్న గ్రామస్థాయి నాయకులు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కోసిగి : మండలంలో అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి తాయన్న ,సహయ కార్యదర్శి ఉలిగయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ముందు రైతులతో కలిసి నష్టపోయిన పత్తి, ఉల్లి, మిరప పంటల మొక్కలతో నిరసన వ్యక్తం చేశారు. సజ్జలగుడం సీపీఐ నాయకులు మూకప్ప,కోసిగి రాం దాసు,రైతులుఐరన్గల్.హనుమంతు,నరసింహులు, వీరేష్, నాగన్ గౌడు, నర్సిరెడ్డి, చిర్తనకల్,ఉలిగయ్య, నరసప్ప, దొడ్డిబెళగల్ ఈరన్న పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులను ఆదరించండి

విశాలాంధ్ర-పత్తికొండ : రానున్న శాసనమండలి ఎన్నికలలో ఉద్య మ నాయకులను ఆదరించాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పట్టభద్రులను కలుసుకొని కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు నవంబర్ 7వ తేదీలోపు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు.ఆయన మాట్లా డుతూ శాసనమండలిలో నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నించే వారిని ఎన్నుకుందామని పిలుపునిచ్చారు. పశ్చిమ రాయల సీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతులనాగరాజు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తినర సింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, మండల సహాయకార్యదర్శిరంగన్న,ఏఐఎస్ఎఫ్జిల్లాకార్యవర్గసభ్యులునజీర్ పాల్గొన్నారు.

ఓటర్ నమోదులో వాలంటీర్ల జోక్యాన్ని నివారించాలి

విశాలాంధ్ర - కర్నూలు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు జరుగుతున్న శాసనమండలి ఎన్నికల ఓటర్సు నమోదులో గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్లు ఓటర్ నమోదులో జోక్యం చేసుకోవడాన్ని నివారించాలని,ఎన్నికల విధుల నుంచి వారిని పక్కన పెట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బీ. గిడ్డయ్య ఒక ప్రకటనలో కోరారు. గ్రామ, వార్డు సచివాలయం వాలంటీర్లు అధికారపార్టీ కార్యకర్తలనీ, ఈ ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్తులను బరిలోనిలిపిందని, ఇలాంటి సమయంలో ఓటరు నమోదు, ఎన్నికల విధులలో వారు పాల్గొనడం అధికార దుర్వినియోగం కిందకి వస్తుందని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘున కిందకు వస్తుందని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తక్షణమే గ్రామ, వార్డు సచివాలయం వాలంటీర్లను పక్కన పెట్టాలని, ఆదేశాలు ఇవ్వాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-ఆస్పరి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ మండలం ప్రధాన కార్యదర్శి యువరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ కళాశాలలో ప్రధానంగా కుర్చీలు మరియు బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేల మీదే కూర్చోండటానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అలాగే కళాశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినీలు బయటకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీటి ట్యాంకును శుభ్రం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్నత స్థాయి ప్రమాణాలతో మౌలిక వసతులు తీర్చిదిద్దామని నిత్యం ప్రకటనలతో గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ రాజేంద్రప్రసాద్ కు వినతి పుత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శులు మల్లికార్జున, మహేష్, నాగేంద్ర విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను కాపాడేందుకు 20 కోట్లు ఖర్చు చేయలేరా?

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హంద్రీనీవా కెనాల్ కింద సాగు చేసుకుంటున్నా పంటలను కాపాడేందుకు కనీసం 20 కోట్లు కూడా ఖర్చు చేయలేని దయనీయ స్థితిలో ఉండటం రైతుల పాలిట శాపంగా మారిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం విమర్శించారు. సోమవారం ఆయన రైతులతో కలిసి కర్నూల్ శివారులోని నన్నూరు టోల్ ప్లాజా సమీపంలో హంద్రీనీవా కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హంద్రీనీవా కింద రాయలసీమ జిల్లాల రైతాంగం సుమారు లక్షల ఎకరాలలో పంటలు సాగు చేసుకుంటున్నారని, ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఎకరాకు 50నుంచి 70వేల రూపాయల దాకా పెట్టుబడి పెట్టి పత్తి, మిరప, వరి తదితర పంటలను రైతులు సాగు చేసుకున్నారని, పంట చేతికి వచ్చే సమయంలో అర్థాంతరంగా నీటిని నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి హంద్రీ నీవాకు నీటిని విడుదల చేసి రైతన్న ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు డిహెచ్ పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, రైతు నాయకులు చిన్నశాలు, నాగన్న, శ్రీరాములు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఎమ్మిగనూరు

షీల్డు టెండరు నోటీసు

అర్.ఓ.సి.నెం.81/ L.D.C/2022. తేది: 31.10.2022

వ్యవసాయ మార్కెట్ కమిటి, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు, ఎమ్మిగనూరు నందు మార్కెట్ యార్డు శుభ్రపర్చుట మరియు శుభ్రపర్చిన చెత్తను బయటకు తరలించుట, ప్రతిదినము కూరగాయల మార్కెట్ శుభ్రపరచుట మరియు చెత్తగా ఏర్పాడిన కూరగాయలను బయటకు తరలించుటకు గాను సంవత్సరము పాటు 01.12.2022 నుండి 30.11.2023 వరకు నిర్వహించుటకు టెండర్లు పిలువడమైనది. టెండరు ధరవత్తు మొత్తము రూ.50,000/- లు " Secretary, Agrl, Market Commitee, Yemiganur, " వారి పేరు మీద తీసి పేరును నమోదుచేసుకొనవలెను. టెండరు షెడ్యులును తేది: 03.11.2022 నుండి 07.11.2022 వరకు కార్యాలయపు పనివేళల నందు ఉదయము 10.00 గం..ల నుండి సాయంత్రము 5.00 గం.. ల వరకు యివ్వబడును. టెండర్లు తెరువబడు తేది: 09.11.2022 ఉదయము 11.00 గం..లకు నిర్వహించబడును. టెండరు షెడ్యులు ధర రూ.300/ లు. మిగతా వివరముల కొరకు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో సంప్రదించవచ్చును. లేదా ఈ మొబైల్ నెం.9182361166 కు కాల్ చేయవచ్చును.

సం// శ్రీమతి పి. లావణ్య పర్సన్, ఇన్-ఛార్జ్ వ్యవసాయ మార్కెట్ కమిటి, ఎమ్మిగనూరు	సం// శ్రీ కె.ఉమాపతిరెడ్డి ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఎమ్మిగనూరు